
మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ /వనపర్తి / జోగులాంబ గద్వాల /నారాయణపేట

## తూడుకుర్తి పల్లె దవాఖాన పనితీరుపై మోడీ అభినందన...




**నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** గ్రామీణ ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు, సంరక్షణ అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పిన పల్లె దవాఖానాలతో గ్రామీణ ప్రాంతంలోని ప్రజల నీరు, పారిశుధ్యం,విద్య, పోషణ, ఆరోగ్యం వంటి తదితర మౌళిక వసతులపై గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలను పల్లెదవాఖానా సిబ్బంది కల్పిస్తున్నారు. తూడుకుర్తి పల్లె దవాఖానా సిబ్బంది కల్పిస్తున్న అవగాహన కార్యక్రమాలపై దేశ ప్రధాని నరేంద్రమోడీ ట్విట్టర్ ద్వారా స్పందించి సిబ్బందికి అభినందనలు తెలిపారు. పల్లె దవాఖానా వైద్యులు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు గ్రామంలోని ప్రజలకు, మహిళలు, చిన్నారుల, ఆరోగ్య సంరక్షణ కోసం ప్రజా ఆరోగ్య సేవలను విస్తృతంగా ప్రచారం చేయడం, ముఖ్యంగా జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా టిబీ, క్షయ, విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు, యోగా వంటి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తు తదానంతరం ఆయా కార్యక్రమాలను పల్లె దవాఖానా వైద్యులు ఫోటోలు మరియు వివరాలను ట్విట్టర్‌లో పోస్ట్ చేయడంతో వీక్షించిన ప్రధాని మోడీ వైద్య సిబ్బంది పనితీరుపై అభినందనలు తెలిపారు.



పల్లె దవాఖానాలో ప్రజలకు వైద్య సేవలు అందజేస్తున్న దృశ్యం

## రజకుల సేవ తల్లి సేవతో సమానం..

**- దోభీఘాట్లకు చమరగీతం పాడి వాషింగ్ మిషన్లు అందజజేశాం**

**- రజక యువజన క్రాంతి సంఘం ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** సమాజానికి రజకులు చేసిన తల్లి తన పిల్లలకు చేస్తున్న సేవతో సమానమని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి వీ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్ న్యూటౌన్ లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన రజక యువజన క్రాంతి సంఘం ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వీరనారి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భూస్వాముల మీద మొట్టమొదట ఎదురుతిరిగి పోరాటం చేసిన ధీశాలి చాకలి ఐలమ్మ అని మంత్రి తెలిపారు. సమైఖ్య రాష్ట్రంలో రజక సోదరుల కోసం దోభీ ఘాట్లు అప్పటి ప్రభుత్వాలు చెప్పుకునేవని, తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కసీఆర్ దోభీఘాట్లకు బదులు పెద్ద పెద్ద వాషింగ్ మిషన్లు అందజేసి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కులవృత్తులకు అందుబాటులోకి తెచ్చారని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో రూ. 70లక్షల నిధులతో వాషింగ్ మిషన్లు అందజేసి, రజక సోదరులకు ఉచిత కరెంట్ అందజేశామన్నారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ గణేశ్,కౌన్సిలర్లు కిషోర్, బీఆర్ఎస్ నాయకుడు నవకాంత్, సంఘం నాయకులు నాగన్న,శ్రీనివాసులు పాల్గొన్నారు.



చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## ఎన్నికలకు సన్నద్ధం కావాలి...

**- కాంగ్రెస్ శ్రేణులకు డీసీసీ అధ్యక్షుడు జీఎంఆర్ పిలుపు**

**- మదనాపురం మండలంలో ముఖ్య కార్యకర్తల సమావేశం**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులు, ముఖ్య కార్యకర్తలు, నాయకులకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జి మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మదనాపురం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మండల ముఖ్య కార్యకర్తలు, నాయకుల సమావేశానికి జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జీఎంఆర్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కమిటీలు వేయాలని, కమీటీలు ఉన్న చోట బలోపేతం చేయాలన్నారు. కమిటీలు వేసుకొని వారినికి రెండు రోజులు కేటాయించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలు స్థానిక ఎమ్మెల్యేల అవినీతిని ప్రజలకు వివరించాలన్నారు. గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం, డబుల్ బెడ్రూం ఇండ్లు, దళితులకు మూడెకరాల భూమి లాంటి పథకాలు అమలు చేయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వ తీరును ఎండగట్టాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు ఏక కాలంలో రూ.2లక్షల రుణమాఫీ, రూ.500కే సిలిండర్, ఆరోగ్యశ్రీ ద్వారా రూ.5లక్షల వరకు ఉచిత వైద్యం, 2లక్షల ఉద్యోగాల భర్తీ లాంటి కీలక హామీలను గడపగడపకు తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో మండల కమిటీ నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నాయి.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు జి మధుసూదన్‌రెడ్డి

## అర్హులైన జర్నలిస్టులందరికి ఇళ్ల స్థలాల పట్టాలు ఇస్తాం: మంత్రి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి ప్రతినిధి,ఏప్రిల్ 16ప్రభాతవార్త:** వనపర్తిలో అర్హులైన జర్నలిస్టులందరికి ఇళ్ల స్థలాల పట్టాలు ఇస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీయుడబ్ల్యూజే(ఐజేయు) జిల్లా అధ్యక్షుడు గుండ్రాతి మధు గౌడ్ ఆధ్వర్యంలో మంత్రిని కలిసి జర్నలిస్టుల సమస్యలను దృష్టికి తెచ్చారు. యూనియన్లకు అతీతంగా అర్హులైన అందరికి స్థలాలను ఇవ్వాలని అధ్యక్షుడు మధుగౌడ్ మంత్రికి విన్నవించారు. పీర్లగుట్ట ఏరియాలో 98మంది జర్నలిస్టులకు పట్టాలు ఇచ్చేందుకు స్థలాన్ని సిద్ధం చేసినట్లు తెలిసిందని, అందరికి సరిపోవన్నారు. ఉషోదయ బీఈడీ కాలేజ్ ఎదురుగా ప్రభుత్వ స్థలం గుర్తించామని, 40ప్లాట్‌లతో సిద్ధం చేసిన లే అవుటును మంత్రికి చూపి వివరాలు తెలిపారు. వెంటనే మంత్రి స్పందించారు. వనపర్తి తహసిల్దార్ రాజేందర్ గౌడ్ తో ఫోన్‌లో మాట్లాడారు. స్థలం ఉన్నట్లు నిర్దారించుకున్నారు. ఆ స్థలంలో కూడా జర్నలిస్టులకు పట్టాలు ఇస్తామని ప్రకటించారు. ఏప్రిల్ 22నుంచి25 తేదీల మధ్య పట్టాలు ఇచ్చేందుకు కృషి చేస్తానని, అదే రోజు జర్నలిస్టు భవన్ కు కేటాయించిన స్థలంలో శంకుస్థాపన చేస్తామని అన్నారు. యూనియన్లకు అతీతంగా జర్నలిస్టులు ప్రభుత్వ సౌకర్యాలు ఉపయోగించుకోవాలని అన్నారు. సోమవారం ముఖ్యులు జిల్లా కలెక్టర్ ను కలిసి తాను హామీ ఇచ్చిన విషయం ప్రస్తావించి, చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేయాలని అన్నారు. మంత్రి హామీలపై జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు. మొక్క అందించి, శాలువాతో మంత్రిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు నోముల రవీందర్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బొలమోని రమేష్, నమస్తే తెలంగాణ ఉమ్మడి జిల్లా బ్యూరో వెంకటేశ్వర్ రావు, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరావు, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు కొండన్న యాదవ్, సీనియర్ పాత్రికేయులు ఊశన్న, పోలిశెట్టి బాలకృష్ణ, కృష్ణయ్య, స్టాఫర్స్ రాజు, యాకుబ్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు నవీన్, కార్యదర్శి శివ, పట్టణ అధ్యక్షులు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి డి.మణ్యం, పికిలి రాము, దినేష్, వహిద్, మోహన్ తదితరులు ఉన్నారు.



మంత్రి నిరంజన్ రెడ్డిని కలిసి సన్మానిస్తున్న జర్నలిస్టులు

## విజయవంతమైన పెన్షన్ కాన్స్టిట్యూషనల్ మార్చ్ టిఎస్‌సిపిఎస్‌యు

**నారాయణపేట ప్రతినిధి,ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** టిఎస్‌సిపిఎస్ఇయు రాష్ట్రశాఖ పిలుపు మేరకు నారాయణపేట జిల్లా కేంద్రంలో సిపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయుల ర్యాలీ స్థానిక మున్సిపల్ పార్కు నుండి ఉదయం 10 గం.లకు ప్రారంభమై పాత బస్టాండ్ మీదుగా, సత్యనారాయణ చౌరస్తాలో మానవహారం, కొత్త బస్టాండ్ నుండి అంబేద్కర్ చౌరస్తావరకు కొనసాగింది. డా. అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా ఉద్యోగుల సామాజిక భద్రత కొరకు కల్పించిన పెన్షన్ హక్కును తిరిగి ప్రభుత్వాలు కల్పించాలని అంబేద్కర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానం వల్ల ఉద్యోగులలో అభద్రతాభవం నెలకొందన్నారు. జీవితాంతం పెన్షన్ బదులు టెన్షన్ పడుతున్నారని వీలైనంత త్వరగా సిపిఎస్ రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ స్కీమ్‌ను ప్రవేశపెట్టాలని కోరారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, రాజేందర్‌రెడ్డి, విద్యాసాగర్, శంకర్, వెంకటరెడ్డి, శ్రీనివాస్,మల్లేష్, రాజగోపాల్, శివశంకర్, నాగరాజు, తిరుపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ర్యాలీకి వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలిపాయి. కార్యక్రమంలో వివిధ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు యశ్వంత్, జనార్ధన్‌రెడ్డి, బాలాజీ, లక్ష్మారెడ్డి, అరుణ, శ్రీదేవి, రాధిక, కృష్ణవేణి, జానకి, మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




ర్యాలీ, మానవహారం నిర్వహిస్తున్న ఉద్యోగులు

## ఢిల్లీ సర్కార్ బిత్తరపోయేలా తెలంగాణ పంటల రాసులు..

**40 కోట్ల మంది భీమాసొమ్ము అదానికి తాకట్టు పెట్టిన బిజెపి**

**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి**

**బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలే మాబలం బలగం**

**ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న**

**ఎంపి పోతుగంటి రాములు**

**తెల్కపల్లి,ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** ఢిల్లీ సర్కార్ బిత్తరపోయేలా తెలంగాణ రైతులు పండించిన ధాన్య రాశులతో బంగారు తెలంగాణ సాధ్యమవుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని చిన్న ముద్దనూరు గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాన్ని నాగంకర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి కెసిఆర్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు ఎన్నో రకాల సంక్షేమ పథకాలను అందించిందని అన్నారు. రైతుల సంక్షేమం కోసం సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసి హరిత సంక్షేమాన్ని రైతుల అభివృద్ధికి రైతుభీమా, రైతుబంధు,ఆసరా పెన్షన్లు అందించిన ఏకైక ప్రభుత్వం బిఆర్ఎస్ అన్నారు. ఇది చూసి ఓర్చుకుని కేంద్ర బిజెపి ప్రభుత్వం మత తత్వాలను రెచ్చగొడుతూ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. 40 కోట్ల మంది ఎల్ఐసి పాలసీదారుల సొమ్మును ఆదాని కార్పొరేట్ కంపెనీకి అప్పజెప్పి ప్రజల నోట్లో మట్టి కొట్టిన కేంద్ర బిజెపి ప్రభుత్వం ముఖ్యమంత్రి కెసిఆర్‌ను విమర్శించే స్థాయి లేదని అన్నారు.

**కార్యకర్తలే మా బలం, బలగం.. ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి**

పార్టీకి కార్యకర్తలే మా బలం బలగమని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి అన్నారు. ప్రతి కార్యకర్తకు తాను అండగా ఉంటానని అన్నారు. నాగర్‌కరూననల్ నియోజకవర్గం అభివృద్ధి కోసం ఎన్నో రకాల సంక్షేమ ఫలాలను అందించాలని ఎంజెఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో సామూహిక వివాహాలు, రక్తదాన శిబిరం నిరుద్యోగ యువకులకు శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ఆధ్వర్యంలో ప్రజాసేవే లక్ష్యంగా పని చేస్తున్నానని అన్నారు.







సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే జనార్ధన్‌రెడ్డి







సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి పోతుగంటి రాములు, ఎమ్మెల్సీ గోరట వెంకన్న

**సంపద పెంచి ప్రజలకు సంక్షేమాలను పంచు..**

**ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ రాష్ట్రంలో సంపద పెంచి పేద ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. కోనసీమను తలదన్నేలా నాగర్‌కర్నూల్ నియోజకవర్గం ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పచ్చని పంటలతో, పంటలు సాగు,త్రాగునీరుతో కళకళలాడుతుందని అన్నారు. ఎమ్మెల్యే మర్రి వ్యవసాయ పారిశ్రామిక సేవా రంగాలలో నాగర్‌కర్నూల్ జిల్లాను అభివృద్ధి చేశారని అన్నారు.

**అభివృద్ధి సాధకుడు ముఖ్యమంత్రి కెసిఆర్**

**ఎంపి పోతుగంటి రాములు**

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సాధకుడు ముఖ్యమంత్రి కెసిఆర్ అని ఎంపి పోతుగంటి రాములు అన్నారు. అందరూ టిఆర్ఎస్ పార్టీ విజయానికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, పార్లమెంట్ సభ్యులు పోతుగంటి రాములు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బైకాని శ్రీనివాస్ యాదవ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మాధవరం హనుమంతరావు, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు ఈదుల నరెందర్‌రెడ్డి, ఎంపిపి కొమ్ముమధు, ఎంజెఆర్ ట్రస్టు అధినేత మర్రి జమున, మార్కెట్ కమిటి చైర్మన్ కిరణ్, జిల్లా రైతు సమితి అధ్యక్షులు పర్వత్‌రెడ్డి, జి. మాధవరెడ్డి, గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందిన ముగ్గురు పార్టీ కార్యకర్తల కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి రెండు లక్షల చొప్పున చెక్కులను వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డిలు అందజేశారు.

## రాజధానిలో అందరికీ ఆత్మగౌరవ భవనాలు..

- బడుగు బలహీన వర్గాల దేవుడు జ్యోతిబాపూలే..
- రజకులకు వాషింగ్ మిషన్లు అందజేశాం..
- దేవాంగ, ఎరుకల కుల సంఘాల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్



హాజరైన కులసంఘం నాయకులు, సభ్యులు



మంత్రిని కలిసేందుకు ఉత్సాహం చూపుతున్న చిన్నారులు

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని గతంలో ఎన్నడూ లేనంతగా అన్ని కులాలకు రాజాధానిలో ఆత్మగౌరవ భవనాలు ఉన్నాయని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పద్మావతీ కాలనీ, గాయత్రి ఫంక్షన్ హాల్‌లో జరిగిన దేవాంగ కుల సంఘం ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేవాంగ ఆత్మగౌరవ భవనం కోసం రాష్ట్ర రాజధానిలో రూ.40కోట్ల విలువైన స్థలం, రూ.75లక్షల నిధులను తమ ప్రభుత్వం కేటాయించిందన్నారు. జిల్లా కేంద్రంలో సైతం స్థలం నిధులు కేటాయిస్తామన్నారు. ఒకప్పుడు బీసీలంతా ఒకే కులంగా ఉండేవారని క్రమంగా వివధ వృత్తులుగా విడిపోయారని ఆ వృత్తులే నేడు కులాలుగా మారిపోయాయన్నారు. సావిత్రీబాయి పోరాటం వల్లే మహిళా అక్షరాస్యత సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో దేవాంగ కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీరభద్రారావు, ప్రధాన కార్యదర్శి ప్రకాశ్‌రావు,జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, ప్రధాన కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.

**ఎరుకల సంఘం ఆత్మీయ సమ్మేళనం..**

మహబూబ్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని బాదం సరోజాదేవి ఆడిటోరియంలో ఎరుకల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి ముఖ్య శ్రీనివాస్‌గౌడ్ అతిథిగా హాజరై ప్రసంగించారు. డా.బీఆర్ అంబేద్కర్, ఏకలవ్యుని చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కొత్తచెరువుకు చెందిన రిటైర్డ్ మున్సిపల్ ఉద్యోగి కృష్ణ చికిత్స పొందుతూ అనారోగ్యంతో మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న మంత్రి బాధిత కుటుంబాన్ని పరామర్శించి మృతదేశం వద్ద నివాళులర్పించారు. అదేవిధంగా మహబూబ్‌నగర్ –రాయిచూర్ రోడ్డులోని నూతన ఆర్డీవో కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన మహబూబ్‌నగర్ క్రికెట్ అరీనా(ఎంసీఏ)ను ప్రారంభించి బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపర్చారు.

**మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ..**

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, అందుకే ప్రస్తుత సమాజంలో బాలికలకు కరాటే ఎంతో అవసరమని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్‌లోని మోనప్పగుట్టలోని మోనేశ్వర స్వామి ఆలయంలోని కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన జీకే మాస్టర్ షోటోకాన్ కరాటే డూ ఇండియా ఆధ్వర్యంలో విజేతలైన బాలబాలికలకు కరాటే, జూడో,కిక్ బాక్సింగ్ విజేతలకు బెల్టుల ప్రదానం చేశారు. బాలికలను శారీరకంగా మానసికంగా వేధింపులకు గురిచేస్తే ఆత్మస్థైర్యంతో ఎదురించాలన్నారు.

## విజయోత్సవ సభను తలపించిన ఆత్మీయ సమ్మేళనం..

**- హైదరాబాద్‌లో దేవరకద్ర నియోజకవర్గ బీఆర్ఎస్ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశం**

**- వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు, పార్టీ శ్రేణులు**

**- అలరించిన సాయిచంద్ ఆటాపాట**

**- సీఎం కేసీఆర్‌కు హ్యాట్రిక్ విజయాన్ని అందిద్దామని ఎమ్మెల్యే ఆల పిలుపు**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** హైదరాబాద్‌లో నివసించే దేవరకద్ర నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం విజయవంతమైంది. చంపాపేట్‌లోని మంద నర్సింహారెడ్డి గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశం విజయోత్సవ సభను తలపించింది. వేలాది మంది కార్యకర్తలు, అభిమానులు పార్టీ శ్రేణులు కుటుంబ సభ్యులతో ఫంక్షన్ హాల్ సందడిగా మారింది. ఆత్మీయ సమావేశానికి ముందుగా మహిళలు బతుకమ్మలతో ఎమ్మెల్యే ఆలకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సహపంక్తి భోజనంలో ఎమ్మెల్యే ఆల దంపతులు పాల్గొని అందరికీ వడ్డించి, కార్యకర్తల కుటుంబాలతో కలిసి భోజనం చేశారు. ఈ సమావేశంలో 6వేలకు పైగా కార్యకర్తల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి , ఆల దంపతులను సన్మానిస్తున్న పార్టీ శ్రేణులు



బతుకమ్మలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

**హ్యాట్రిక్ విజయాన్ని అందిద్దాం..**

ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే ఆల మాట్లాడుతూ ఈసారి ఎన్నికల్లో భారీ మెజార్టీతో సీఎం కేసీఆర్‌కు హ్యాట్రిక్ విజయాన్ని బహుమతిగా ఇద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యకర్తలు పార్టీ పట్టుగొమ్మలని వారి ఎంత పటిష్టంగా ఉంటే పార్టీ అంత బలంగా ఉంటుందన్నారు. 9ఏండ్ల పాలనలో తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందిందని అందుకు కేంద్రం అందజేస్తున్న అవార్డులే నిదర్శనమన్నారు. అన్ని రకాల కుల సంఘాలకు ప్రాధాన్యత ఇస్తూ కులవృత్తులకు జీవం పోస్తున్నారని పేర్కొన్నారు. దేవరకద్ర నియోజకవర్గంలో 2104కు ముందు 5వేల ఎకరాలకు మించి సాగుభూమి లేకుండే అని గత ఖరీఫ్‌లో 65162 ఎకరాల్లో వరి సాగైంది అంటే ఎంత మార్పు జరిగిందో ఆలోచించాలన్నారు. రాష్ట్రంలోనే అత్యధిక చెక్ డ్యాంలు నిర్మించి నీటి వనరులు పెంచామన్నారు. దీంతో నియోజకవర్గంలో 4వేలకుపైగా బోర్లు రీచార్జి అయ్యాయన్నారు. ఈమేరకు ప్రొజెక్టర్ ద్వారా నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, పంట పొలాలు, చెరువులు,కాలువలను విజ్యువల్స్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కళా కారుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయి చంద్ ఆటాపాట అందరినీ అలరించాయి. అనంతరం ఎమ్మెల్సీ ఆత్మీయ సమ్మేళనాల ఇన్‌చార్జి కశిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాట్లాడారు. సమావేశం ప్రారంభానికి ముందు అమరవీరులకు మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో భూత్పూర్ ఎంపీపీలు కదిరె శేఖర్‌రెడ్డి, గుంత మౌనిక, జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన కార్యకర్తల కుటుంబాలు

## కౌకుంట్లలో పక్షుల దాహార్తి తీరుస్తున్న చిన్నారులు..

అందుకేనేమో...పిల్లలూ..కల్లాకపటం ఎరుగని కరుణామ యులూ అని రచయితలు ఊరికే అనలేదు...దానిని కౌకుంట్ల చిన్నారులు నిజం చేసి చూపెడుతున్నారు. ప్రస్తుతం పిల్లలూ వేసవిని దృష్టిలో పెట్టుకొని పక్షులకు తాగడానికి నీరు పెట్టే దృశ్యాలు వాట్సాప్‌లలో చక్కర్లు కొడుతున్నాయి. చిన్న మెదడులలో వచ్చే పెద్ద ఆలోచన అందరిని ఆలోచింప జేస్తుంది.మూగ జీవాలపై ఉండే ప్రేమను తట్టిలేపుతుంది.అలాగే ఉమ్మడి దేవరకద్ర మండలంలోని కౌకుంట్ల మండల కేంద్రంలో కొన్ని రోజులుగా కొంత మంది చిన్నారులు ఇదే తరహాలో పక్షుల దాహార్తిని తీరుస్తున్నారు.స్థానిక నసీంబేగ్ ఇంటిపైన చిన్నరులు నదీమ్,ఆసియా సుల్తానా,ఆయాన్‌లు ప్లేట్‌లో నీరుపోసి పక్షుల దాహార్తిని తీరుస్తున్నారు. పెద్దల సూచన మేరకు వారు ప్రతి రోజు మరువకుండా పక్షులకు తాగడానికి నీళ్ళు పెడుతున్నారు.దీంతో ఈ చిన్నారులను గ్రామస్థులు అభినందిస్తున్నారు.



*దేవరకద్ర,ఎప్రిల్ 16 ప్రభాతవార్త*

## నాటక ప్రదర్శనకు రూ.20వేల ఆర్థికసాయం

**కల్వకుర్తి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:**కల్వకుర్తి మండలం తాండ్ర గ్రామంలో శ్రీ ఆది చింతల మునిరంగస్వామి నాటక ప్రదర్శన నిర్వహిస్తున్నారు. గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాల్లో ప్రదర్శిస్తున్న నాటకాలను ప్రొత్సహించాలన్నారు. ఫౌండేషన్ సహకారంతో రూ.20 వేల ఆర్థిక సహయాన్ని నాటకదారులకు అందించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఉప సర్పంచ్ కేశమల్ల అల్లాజీ, గ్రామస్తులు సుల్తాన్, క్యామ శ్రీనివాసులు, బొల్లె చిట్టయ్య, కృష్ణయ్య, అంజయ్య, బాలస్వామి, ఫౌండేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.



## పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని విజయవంతం చేద్దాం...

**వెల్దండ, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:**వెల్దండ మండల కేంద్రంలోని బ్రహ్మగిరి దేవాలయంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 1965 నుంచి 2022 వరకు జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులతో ఆత్మీయ సమ్మేళనం ఈ నెల 23న నిర్వహించి విజయవంతం చేద్దామన్నారు. ప్రతి ఒక్కరికి సమావేశాన్ని అందించి సమావేశానికి అందరు హాజరయ్యే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బచ్చు రామకృష్ణ, ఉప్పు ఆంజనేయులు, విజయేందర్‌రెడ్డి, వేణుగోపాలాచారి, విష్ణు సాగర్, శ్రీనుగౌడ్, మదన్‌గౌడ్, వెంకటేష్,సహీర్ అహ్మెద్ షేక్ తదితరులు ఉన్నారు.



## శివగంగా భైలునాటకానికి రూ.30వేల ఆర్థిక సహాయం

**వెల్దండ, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:**మండల పరిధిలోని రాచూర్ గ్రామంలో శివగంగా కళ్యాణ బైలు నాటకానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్‌ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సమకూర్చిన రూ.30వేల ఆర్థిక సహయాన్ని ఫౌండేషన్ సభ్యులు వెంకట్రావ్‌తో పాటు ఫౌండేషన్ సభ్యులు నాటకదారులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ నాటకాలను పౌండేషన్ ద్వారా ప్రొత్సహించి వారికి ఆర్థిక సహయం అందించి అండగా నిలుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో యాదయ్య, మల్లేష్ ముదిరాజ్, జయరాం, లక్ష్మయ్య, కృష్ణయ్య, శంకర్, రామకృష్ణ, బక్కయ్య, వంశీ, శ్రీరాములు, ఫౌండేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.



## ప్రశాంతంగా మోడల్ ప్రవేశ పరీక్ష

**వెల్దండ, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:**వెల్దండ మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో 6,7వ తరగతుల ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు సీఎస్.పుష్పలత తెలిపారు. 6వ తరగతి ప్రవేశ పరీక్షకు సెంటర్ ఎ లో 240 మంది విద్యార్థులకు 156 మంది హాజరు కాగా, సెంటర్ బి లో 195 మంది విద్యార్థులకు గాను 129 మంది హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్నం 7వ తరగతి ప్రవేశ పరీక్షకు సెంటర్ ఎ లో 235 మంది విద్యార్థులకు 180 మంది హాజరు కాగా, సెంటర్ బి లో 212 మంది విద్యార్థులకు గాను 154 మంది హాజరైనట్లు తెలిపారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించినట్లు సీఎస్.పుష్పలత పేర్కొన్నారు. డీఓ రాధకృష్ణ, సీఎస్ పర్వతాలు, నర్సింహ్మాతదితరులు ఉన్నారు.




## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం..

**కల్వకుర్తి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:**కల్వకుర్తి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన బోయ జంగయ్య అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. మృతుడి కుటుంబాన్ని ఐక్యత ఫౌండేషన్ సభ్యులు పరామర్శించి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్‌ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సమకూర్చిన రూ.5వేల ఆర్థిక సహయాన్ని అందించారు. మృతుడి కుటుంబానికి ఫౌండేషన్ తరుపున ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్తులు రవి, మహేష్, హరీష్, శ్రీహరి, సాయి, మల్లయ్య, భీరయ్య, శ్రీపతిరాజు, హసన్, గణేష్, షఫీ, శేఖర్ తదితరులు ఉన్నారు.



## దేవరకద్ర ఎస్ఐకి సన్మానం

**దేవరకద్ర,ఎప్రిల్ 16 ప్రభాతవార్త:** దేవరకద్రలో కొత్త ఎస్ఐగా పదవిభాద్యతలు చేపట్టిన జి.వెంకటేశ్‌కు ఆదివారం దేవరకద్ర మండల కిరాణ అసోసియేషన్ సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐను మర్యాదపూర్వకంగా కలసి వారు పూల మాలు వేసి శాలువాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు గుద్దేటి చంద్రయ్య,యువజన సంఘం సభ్యులు దోమహరికాంత్,కిరాణ అసోసియేషన్ సంఘం ఉపాధ్యక్షుడు బిల్లకంటి సత్యం,సభ్యులు మైలపురం రమేశ్,కల్వఈశ్వర్,బిల్లకంటి వెంకట్‌రాములు,సుంకరి రాఘవేంధ్ర,సుంకరి వంశీకృష్ణ,వేముల దశరథ,మారం కిశోర్‌కుమార్,కొండ శ్రీనివాసులు,నారని బాలస్వామి,అలంపల్లి రవికుమార్,బీచా ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## వీపనగండ్ల మండలంలో చలివేంద్రం ఏర్పాటు..

**వీపనగండ్ల,ఏప్రిల్ 16ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఎండల తీవ్రత దృష్ట్య మండల కేంద్రానికి వివిధ గ్రామాల నుండి వచ్చే ప్రజలకు దాహం తీర్చడానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ముంత మల్లయ్య ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటుచేయడం జరిగింది. చలివేంద్రాన్ని గ్రామ సర్పంచ్ వంగూరు నరసింహారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువకులు పాల్గొన్నారు. చలివేంద్రం ఏర్పాటు చేయడంపై పలు గ్రామాల నుండి మండలానికి వచ్చే ప్రజలు తమ దాహం తీరిపోతుందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వంగూరు నరసింహారెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి,బీఆర్ఎస్ నాయకులు శివయాదవ్, యువకులు పాల్గొన్నారు.

# తిరుచ్చివాహనంపై ఊరేగిన వెంకటేశ్వరస్వామివారు...



స్వామివారికి హారతి ఇస్తున్న పురోహితుడు



అలంకరణలో శ్రీదేవిభూధేవి సమేతంగా స్వామివారు



తిరుచ్చిసేవ నిర్వహిస్తున్న పురోహితులు

**- మన్యంకొండలో దక్షిణకట్ట వరకు ఘనంగా సేవ**

**- అలంకరణలో శ్రీదేవిబూదేవి సమేతంగా స్వామివారి దర్శనం..**

**దేవరకద్ర,ఎప్రిల్ 16 ప్రభాతవార్త:** జిల్లాలోని పేరెన్నికగన్న మన్యంకొండ శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు తిరుచ్చిసేవపై స్వామివారిని ఊరేగించారు. ప్రతి శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ కార్యక్రమాన్ని సాంప్రదాయరీతిలో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా దేవస్థానం గర్భగుడి నుండి దేవస్థానం ముందున్న రథ మండపం వరకు శ్రీదేవిభూధేవి సమేతంగా స్వామివారి తిరుచ్చిసేవను ధక్షిణకట్ట వరకు నిర్వహించారు. అక్కడ కూడ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.పురోహితుల వేధమంత్రాలు,భక్తుల హరినామశ్చరణ,కాగడాల వెలుతురులో స్వామివారి సేవ ముందుకు కదిలింది. ఈ సేవను చూసి భక్తులు భక్తిపారవశ్యంతో పులకరించిపోయారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు,తదితర పూజలను నిర్వహించారు.అనంతరం స్వామి వారిని మళ్ళి గర్భగుడిలోకి తీసుకెళ్ళారు. అక్కడ వివిద పూజలను నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు నిర్వహించారు.

**అలంకరణలో దర్శనమిచ్చిన స్వామివారు..**

మన్యంకొండలో తిరుచ్చిసేవ సందర్భంగా స్వామి వారు తిరుచ్చిసేవపై శ్రీదేవిభూధేవి సమేతంగా ఊరేగుతూ అలంకరణలో భక్త కోటికి దర్శనమిచ్చారు. రకరకాల పూలు,బంగారు ఆభరణాలతో స్వామివారిని అలంకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి భక్తులు మన్యంకొండకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్,అళహరి రామకృష్ణ,ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేశ్,నరసింహ్మాయ్య, పాలకమండలి సభ్యులు,పర్యవేక్షకుడు నిత్యానందచారి,సిబ్బంది సుదర్శన్,నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కందుకూరి వీరేశలింగం జయంతి వేడుకలు..

**జల్లాఘణపురం,ఏప్రిల్ 16ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఆదివారం సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో కందుకూరి వీరేశలింగం చిత్ర పటానికి పూలమాల వేసి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్మరి గోపి మాట్లాడుతూ వీరేశలింగం పంతులు సంఘ సంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి, సాహితీ వ్యాసారంగమ్లో ఎక్కువ కృషి చేసిన మహనీయుడు తెలుగు జాతికి నవయుగ వైతాళికుడు, బాలికల కొరకు పాఠశాలలు ప్రారంభించి, మగపిల్లలతో ఆడపిల్లలు కలిసి చదువుకునే సహ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టాడని అన్నారు. అంటరాని కులాలకు చెందిన పిల్లలను కూడా చేర్చుకుని మిగతా పిల్లలతో కలిపి వారికి ఉచితంగా చదువు చెప్పడంతో పాటు పుస్తకాలు, పలకా, బలపాలు కొనిచ్చి సమాజంలో విప్లమాత్మక మార్పును సాధించాడని, అప్పటి సమాజంలో బాల్యంలోనే ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేసేవారని, కాపురాలకు పోకముందే భర్తలు చనిపోయి, వితంతువులై, అనేక కష్టానష్టాలు ఎదుర్కొనే వారు అన్నారు. దీనిని రూపేమాపేందుకు వితంతువు పునర్వివాహాలు జరిపించాలని ప్రచారం చేయడమే కాకుండా ఎన్ని కష్టాలెదురైనా ఆచరణలో పెట్టిన మహనీయుడు వీరేశలింగం పంతులు అని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణయ్య గౌడ్,శ్రీకాంత్, గ్రామ యువకులు, తదితరులు పాల్గొన్నారు.



వీరేశలింగం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళిఅర్పిస్తున్న దృశ్యం

## వడ్లు కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలి..

**జిల్లా రైతు సంఘం కార్యదర్శి పరమేశ్వర చారి**

**వనపర్తి టౌన్,ఏప్రిల్ 16ప్రభాతవార్త:** వ్యవసాయ మార్కెట్ వడ్లు తీసుకువచ్చి 4రోజులు గడుస్తున్న ఇంకా వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం లేదని వనపర్తి జిల్లా రైతు సంఘం జిల్లా కార్యదర్శి పరమేశ్వర చారి అన్నారు. ఆదివారం వనపర్తి వ్యవసాయ మార్కెట్ ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ కు రైతులు వడ్లు తీసుకువచ్చిన సుమారు 4రోజులు అవుతున్న ఇప్పటివరకు వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని ఆయన అన్నారు. జిల్లా వ్యాప్తంగా అధికారులు తక్షణమే వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతు దగ్గర నుండి వరి కొనుగోలు చేయాలని, తాలు తరుగుతు పేరుతో రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని అన్నారు. అదే విధంగా రైతులకు గతంలో వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి రైతులకు రూ.5భోజనం ఏర్పాటు చేస్తానని చెప్పడం జరిగిందని, కానీ నేటి వరకు దాని ఏర్పాటు చేయలేదని, దాన్ని తక్షణమే రైతులకు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు కోడేరు బాలస్వామి, బాలయ్య, నరసింహ, వెంకటయ్య, బాలరాజు, శ్రీనివాసులు, అలివేలమ్మ, మంగమ్మ, నీలమ్మ,తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న పరమేశ్వర చారి

## కాంగ్రెస్ టీపీసీసీ సభ్యులు చింతలపల్లి జగదీశ్వర్‌రావు ఔదార్యం..

**వీపనగండ్ల,ఏప్రిల్ 16ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని వివిధ గ్రామాల్లో వివిధ సమస్యలతో బాధపడుతున్న వారికి కొల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు టీపీసీసీ సభ్యులు చింతలపల్లి జగదీశ్వర్ రావు ఆర్థిక సహాయం అందజేశారు. వివరాల్లోకి వెళితే వీపనగండ్ల మండలం తూముకుంట గ్రామానికి చెందిన మల్లెపూల చంద్రమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించడం జరిగింది. వారికి రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఇదే గ్రామానికి చెందిన చుక్కాయిపల్లి బాలస్వామి ఇటీవల మరణించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల చేతులమీదుగా వారి కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు. తూముకుంట గ్రామానికి చెందిన జంగిడి శ్రీనివాసులు కి ఆపరేషన్ సహాయం నిమిత్తం రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో తూముకుంట గ్రామ కాంగ్రెస్ నాయకులు శివ గౌడ్, నిరంజన్, ఎల్లయ్య, బాబు రెడ్డి, స్వామి, అఫ్రోజ్, సురేష్, యువజన కాంగ్రెస్ నాయకులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## రాత్రి వేళల్లో గుట్టు చప్పుడు కాకుండా ఇసుక దందా..!

**మట్టిని మాయం చేసి ఇసుకగా తయారు చేసి**

**లింగాయపల్లి శివారులోని ఎల్లమ్మకుంట పక్కన,మహ్మదాబాద్ రెవెన్యూ శివారులోని సాకిరేవు వాగు దగ్గర ఫిల్టర్ ఇసుక డంపులు**

**రాత్రింబవళ్లు ఒండ్రు ఇసుక మట్టిన తరలించి ఫిల్టర్ చేసి ఇసుక అమ్ముకుంటున్న వ్యాపారులు**

**అధికారులు డంపులను జెసిబిలతో కూలగొట్టిన మళ్లీ కట్టుకుని ఫిల్టర్ చేసి అమ్ముకుంటున్న వైనం**

**మహ్మదాబాద్,ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** వాగులలో రైతుల పంట పొలాలలో మట్టి, ఒండ్రు ఇసుకను ఎలాంటి అనుమతులు లేకుండా ఫిల్టర్ ఇసుకను యారు చేసి అధిక ధరలకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. మండ లంలో ఫిల్టర్ ఇసుక దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది.మహ్మదాబాద్ రెవెన్యూ శివారులోని సాకిరేవు వాగు దగ్గర అలాగే మండలంలోని లింగాయపల్లి సమీపంలోని ఎల్లమ్మకుంట పక్కన ఫిల్టర్ ఇసుక డంపులు చేసుకుని ఒండ్రు ఇసుక, మట్టిని ఫిల్టర్ చేసి ఇసుకను తయారు చేసి పక్కనే గుట్టల్లో వాగు సమీపాన చెట్ల మధ్యలో ఇసుకను నిల్వ చేసుకుని రాత్రి వేళల్లో గుట్టు చప్పుడు కాకుండా ఇసుకను తరలించి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. పక్కనే పంట పొలాల రైతులు ఇదేంటని ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతూ ఇసుక తయారు చేస్తున్నట్లు ఎవరికైనా చెబితే మీ అంతు చేస్తామని బెదిరింపులకు గురి చేస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. అధికారులు గుర్తించి డంపులను ధ్వంసం చేసిన కొన్ని రోజుల తరువాత మళ్లీ డంపులను సిమెంట్ ఇటుకలతో తయారు చేసుకుని యధావిధిగా మళ్లీ వారి దందాను కొనసాగిస్తున్నారు.



లింగాయల్లి సమీపంలో ఎల్లమ్మకుంట పక్కన ఉన్న ఫిల్టర్ ఇసుక తయారీ కేంద్రం

**నామమాత్రపు చర్యలతోనే రెచ్చిపోతున్న వ్యాపారులు..**

అక్రమంగా ఫిల్టర్ ఇసుకను తయారు చేసి అమ్ముకుంటున్న విషయం అధికారుల దృష్టికి రాగానే డంపులను జెసిబిలతో కూలగొట్టి రావడంతో మళ్లీ నిర్మించుకుని వారికి ఇష్టం వచ్చినట్లు ఇసుక దందాను కొనసాగిస్తున్నారు. నామమాత్రపు చర్యల వల్ల ఏం కాదులే మళ్లీ తయారు చేసుకోవచ్చన్న విధంగా ఫిల్టర్ ఇసుక వ్యాపారులు రెచ్చిపోతున్నారు. అధికారులు గట్టి చర్యలు తీసుకుని ఫిల్టర్ ఇసుకను, అక్రమ ఇసుకను అడ్డుకోవాలని మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



మహ్మదాబాద్ లోని సాకిరేవు దగ్గర ఉన్న ఫిల్టర్ ఇసుక తయారీ కేంద్రం

## డోకూర్‌లో యువకుడి అదృశ్యం..

**పోలీసులకు తల్లి ఫిర్యాదు**

**దేవరకద్ర,ఎప్రిల్ 16 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం డోకూర్‌లో ఓ యువకుడు వారం రోజులుగా కనిపించకుండా పోయాడు.ఎస్ఐ వెంకటేశ్ కథనం ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి.డోకూర్ గ్రామానికి చెందిన అశోక్‌గౌడ్(27)అనే యువకుడు ఈ నెల 9వ తేది రోజు ఉదయం 6గంటలకు ఇంటినుండి బయలుదేరాడు. మళ్ళి తిరిగి ఇంటికి రాలేదు.ఈ రోజు నుండి అశోక్‌గౌడ్ ఇప్పటివరకు కనిపించకుండా పోయాడు.దీంతో అశోక్‌గౌడ్ తల్లి జయమ్మ తన కొడుకు కనిపించడం లేదని ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.అట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు.

## బాధిత యువకుడికి మిత్ర ఫౌండేషన్ ఆర్థికసాయం



**కల్వకుర్తి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:**కల్వకుర్తి పట్టణంలోని బాల్‌రాం నగర్ కాలనీకి చెంది న గంగారం నవీన్ అనే యువకుడు అనారోగ్యంతో బాధప డుతూ వైద్యం చే యించుకోవడానికి ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడుతు న్నాడు. విషయం తెలుసుకున్న మిత్ర ఫౌండేషన్ చైర్మన్ కుడుముల చంద్రకాంత్‌రెడ్డి తన బృందం సభ్యులతో కలిసి నవీన్‌ను ఆదివారం పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5వేల ఆర్థిక సహయం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.

## ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

**వెల్దండ, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:**మత సామరస్యాలకు ప్రతీకగా పండుగలు నిలుస్తాయని ఐక్యత ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరప్రసాద్‌రెడ్డి అన్నారు. వెల్దండ మండలం కొట్ర గ్రామంలోని ముస్లిం సోదరులకు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్‌ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సహకారంతో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ విందుకు ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరప్రసాద్‌రెడ్డి హాజరై ఖర్జూర పండ్లు తినిపించి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో మహబూబ్‌అలీ, సద్దాం, అరీఫ్, దస్తాగిరి, షఫీ, సిరాజ్, గౌస్, ఖైఫ్, వహిద్‌తో ఫౌండేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.



## గంగానది పుష్కరాలలో దేవరకద్ర ఆర్యవైశ్యులు



**దేవరకద్ర,ఎప్రిల్ 16 ప్రభాతవార్త:** దేవరకద్రకు చెందిన ఆర్యవై శ్యులు ఆదివారం గంగానది పుష్కరాలలో పాల్గొన్నారు. ఈ నెల 15న వీరంతా గంగానది పుష్కరాలకు బయలేదేరి వెళ్ళారు. దాదా పు 25 మంది ఆర్యవైశ్యులు ఈ పుష్కరాల యాత్రకు వెళ్ళారు.అక్కడ పలు దేవాలయాలలో వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు విరాళం..

**దేవరకద్ర,ఎప్రిల్ 16 ప్రబాతవార్త:** దేవరకద్ర మండలం బల్సుపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు అదే గ్రామానికి చెందిన పుట్ట చంద్రమౌళి భార్య అరుణ రూ.10వేల16 రూపాయల విరాళాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో పుట్ట బాలప్ప,పుట్ట మొగులయ్యలతో పాటు గ్రామ అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## మాజీ ఎమ్మెల్యే నీరజారెడ్డి కన్నుమూత


నీరజారెడ్డి (ఫైల్)

**అలంపూర్,ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా బీచుపల్లి గ్రామ సమీపంలో కర్నూలు జిల్లా ఆలూరు మాజీ ఎమ్మెల్యే నీరజారెడ్డి రోడ్డు ప్రమాదంలో కన్నుమూశారు. హైదరాబాద్ నుండి కర్నూల్‌కు వెళ్తుండగా బీచుపల్లి వద్ద టైరుపేలి ఫార్చునర్ కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన ఆమెను కర్నూలు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. 2009లో ఆలూరు నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఆమె ప్రస్తుతం ఆలూరు బిజెపి ఇంఛార్జిగా ఉన్నారు.

## 21న పాలమూరులో నిరుద్యోగుల మార్చ్..

**- హాజరుకానున్న బండి సంజయ్**

**- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి వెల్లడి**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఈనెల 21న నిర్వహించే నిరుద్యోగుల మార్చ్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ హాజరుకానునట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి తెలిపారు. ఆదివారం మహబూబ్‌నగర్ బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.



టీఎస్‌పీఎస్సీలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై నిరసనగా మహబూబ్‌నగర్ టీటీడీ కల్యాణమండపం వద్దకు చేరుకుంటారని అక్కడి నుంచి క్లాక్‌టవర్ వద్ద కు నిరుద్యోగులు చేరుకుని నిరసన వ్యక్తం చేస్తారన్నారు. టీఎస్‌పీఎస్సీ లీకులకు బాధ్యులైన మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలని, అభ్యర్థులకు ఒక్కొక్కరికీ రూ.లక్ష నష్టపరిహారం చెల్లించాలని, అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్లతో నిరుద్యోగ మార్చ్ ఉంటుం దన్నారు. కావునా నిరుద్యోగ సమస్యలపై పోరాడుతున్న బీజేపీకి అంరూ అండగా నిలవాలని యువత పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అంజయ్య, నారాయణ, సుబ్రహ్మణ్యం, ఎన్‌పీ వెంకటేశం పాల్గొన్నారు.

## ఆరెకటికలు ఏకం కావాలి..

**జిల్లా నాయకులు మండికారి బాలాజీ**

**పదర,ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** కేంద్ర సామాజిక న్యాయశాఖ, సాధికారిక మంత్రి వీరేంద్రకుమార్ కటిక ఈనెల 20న శ్రీశైలం వస్తున్నారని అచల భారత ఆరెకటిక అన్నదాన సత్రం కార్యనిర్వహణ కార్యదర్శి, ఆలిండియా కటిక ఫెడరేషన్ జిల్లా నాయకులు మండికారి బాలాజీ తెలిపారు. పదరలో ఆరెకటిక సంఘం ముఖ్య నాయకులను కలిసి



సమావేశానికి ఆహ్వానించారు. బాలాజీ మాట్లాడుతూ శ్రీశైల భ్రమ రాంబిక మల్లికార్జున స్వామి వార్లను దర్శంచేసుకుని అనంతరం సత్రం దగ్గర ఉదయం 11 గం.లకు బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. ఈ సభలో రెండు తెలుగు రాష్ట్రాల ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. ఆరె కటికలు తెలుగు రాష్ట్రాలలో దుర్భరమైన పరిస్థితుల్లో జీవిస్తున్నారని అన్నారు. వీరిని పట్టించుకునే నాదుడే లేడని అన్నారు. ఈ విషయం కేంద్ర మంత్రి దృష్టికి తీసుకుపోతామని తెలిపారు. సమావేశంలో జిల్లా ఆరె కటిక యువజన కార్యదర్శి పోకల్‌కార్ రామోజీ, పదర మండల నాయకులు నిరంజన్, నర్సోజీ, లక్ష్మోజీ, ఎల్లోజీలు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డ్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని నెల్లికొండ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో నూతనంగా రూ.3కోట్ల 44 లక్షలతో మార్కెట్ ముఖద్వారం, సెక్యూరిటీ గదులు, ఓపెన్ ప్లాట్ ఫారం చుట్టు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే మర్రి జనార్ధంరెడ్డి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్‌లో రైతులకు అన్ని విధాల మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు.



అభివృద్ధి పనుల శంకుస్థాపనకు విచ్చేసిన ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డిని వ్యవసాయ మార్కెట్ అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భైకాని శ్రీనివాస్‌యాదవ్; మార్కెట్ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, మార్కెట్ యార్డ్ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కు అందజేసిన ఎమ్మెల్యే..

**గద్వాల ప్రతినిధి,ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గద్వాల టౌన్ ఒంటెలపేటకు చెందిన లబ్దిదారులు పరశురాముడు తండ్రి రాముడు చికిత్స నిమిత్తం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి చేతులమీదుగా సీఎం సహాయనిధి రూ. 24000ల చెక్కును అంజేశారు. కార్యక్రమంలో గద్వాల టౌన్ పార్టీ అధ్యక్షుడు



గోవిందు, ఆలయ కమిటి ఛైర్మన్ వెంకట్రాంరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు రమేష్‌నాయుడు, నవీన్‌రెడ్డి, బషీర్, పరశురాముడు పాల్గొన్నారు.

## అభాగ్యులకు అండగా సీఎం సహాయ నిధి..

**-ఎంపీ పోతుగంటి రాములు**

**నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు గాయపడిన క్షతగాత్రులకు, అనారోగ్య భారిన పడి చికిత్సలు చేయించుకోలేని అభాగ్యులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్, ఎల్ఓసీని అందించి అభాగ్యులకు అండగా నిలుస్తోందని నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు పేర్కొన్నారు. ఆదివారం అమ్రాబాద్ మండలం



వంకేశ్వరం గ్రామానికి చెందిన పి.చెన్నయ్యకు రూ.60వేలు, పదర మండలం ఉడిమిల్ల గ్రామానికి చెందిన బబితా తండ్రి పెద్దయ్యకు రూ.20వేలు, యూ.సునితకు రూ.18వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జి.గోవర్ధన్‌కు రూ.80వేల ఎల్ఓసీ చెక్కును ఎంపీ రాములు బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశ పెట్టి మహిళలకు, రైతులకు, క్షతగాత్రులను ఆదుకునేందుకు ఆర్థిక సహాయంతో పాటు సదుపాయాలను కల్పించి వారి కుటుంబానికి భరోసా కల్పిస్తోందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

# సిపిఎస్ ఉద్యోగుల ర్యాలీ.. అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం

**గద్వాల ప్రతినిధి,ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర సిపిఎస్ ఉద్యోగుల సంఘం జోగులాంబ గద్వాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల గద్వాల నుండి సిపిఎస్ రద్దుకై పెన్షన్ కాన్స్టిట్యూషనల్ ర్యాలీ ప్రారంభమైంది. వైఎస్సార్ సర్కిల్ పాత బస్టాండ్ వద్ద నినాదాలతో మానవహారం నిర్వహించారు. నేడు అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన విధంగానే రాష్ట్ర ప్రభుత్వం ఆర్టికల్ 309 ప్రకారం సిపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ ప్రక్రియ పునరుద్ధరించాలని గద్వాలలో సిపిఎస్ ఉద్యోగులు కదం తొక్కారు. బాలికల ఉన్నతపాఠశాల నుండి పాత బస్టాండ్ వరకు ర్యాలీ, మానవహారం నిర్వహించి అంబేద్కర్ చౌక్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 309 ప్రకారం పెన్షన్ అనేది ఉద్యోగుల హక్కని కాని 2004 తర్వాత ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల విభజన (ఓపిఎస్,సిపిఎస్) జరగడంతో ఉద్యోగులు సామాజిక భద్రత కోల్పోవడం జరిగిందన్నారు. పెన్షన్ అనేది ఉద్యోగి దీర్ఘకాలం పనిచేసినందుకు ఇచ్చే ప్రతిఫలం కాదు. అందులో ఉద్యోగుల సామాజిక,ఆర్థిక, భద్రత ప్రయోజనాల దాగిఉన్నాయని 1982లో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సుప్రీం తీర్పును కూడా పట్టించుకోకుండా వృద్ధాప్యం శాపంలా పరిణమించకుండా మార్కెట్ ఆధారిత పెన్షన్ అమలు చేయడం ఉద్యోగుల ఉసురు తీయడమే. అంతేకాక అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితో ఏర్పడిన తెలంగాణలో ఉద్యోగుల ఆర్థికత 309 ప్రకారం పాత పెన్షన్ ప్రక్రియ పునరుద్ధరించాలని కోరారు. ఈ





ర్యాలీ, మానవమారం నిర్వహిస్తున్న సిపిఎస్ ఉద్యోగులు

కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగరాజు, రాష్ట్ర సహ అధ్యక్షులు విష్ణు, జిల్లా కోశాధికారి రమేష్, జిల్లా గౌరవాధ్యక్షుడు బుచ్చన్న, జిల్లా క్రమశిక్షణ కమిటి ఛైర్మన్ నరసింహ,జిల్లా సహాధ్యక్షులు నగేష్, ప్రతాప్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సూర్యప్రకాష్‌రెడ్డి, లక్ష్మినారాయణ, అంజి, పరుషరం, ఎల్లస్వామి, కొండాపురం ప్రతాప్, మహిళల సభ్యులు దానమ్మ, వెంకటలక్ష్మి, సుజాత, అజుబ, సురేఖ, సుధారాణి, అనూష, శ్రీలత, గద్వాల మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, టీఎన్‌జిఓ నాగార్జునగౌడ్, బీజాపూర్ ఆనంద్, టెక్నికల్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరాజారెడ్డి, రెవెన్యూ అసోసియేషన్ నగేష్, యుటిఎఫ్ గోపాల్, పిఆర్‌టియు తిమ్మారెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, తపస్ మహేందర్, హెల్త్ డిపార్టుమెంట్ సిసి వెంకటేష్, తిరుమలరెడ్డి, ఎస్‌జిటిఓ సోమసుందర్‌రెడ్డి, పంచాయతీ రాజ్ సెక్రెటరీ జిల్లా అధ్యక్షులు ఖాజామీర్, పశు సంవర్ధకశాఖ భూమ్య, నాల్గవ తరగతి ఉద్యోగ సంఘం బషీర్ అహ్మద్, టిపిఆర్‌టియు తిమ్మప్ప, బిసిటియు వెంకటేష్, ఎస్టీయు పి. లక్ష్మణ్, శంకర్‌నాయక్, టిఎస్టీయు రమేష్, మల్లికార్జున్, జిటిఎ కృష్ణ, వివిధ సంఘ నాయకులు, సిపిఎస్ సంఘం వివిధ మండలాల నాయకులు, ఓపిఎస్ ఉద్యోగులు పెద్దసంఖ్యలో ర్యాలీకి సంఘీభావంగా వచ్చి విజయవంతం చేశారు.

# జిల్లా కబడ్డీ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశానికి హాజరైన మున్సిపల్ ఛైర్మన్

**గద్వాల ప్రతినిధి,ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన జోగులాంబ గద్వాల జిల్లా కబడ్డి అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ ఛైర్మన్ బిఎస్ కేశవ్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఛైర్మన్ కేశవ్ మాట్లాడుతూ జిల్లా తరపున ఆడుతున్న కబడ్డి క్రీడాకారులు ప్రతిరోజు ఉదయ గ్రౌండ్‌లో క్రమశిక్షణతో వారి క్రీడానైపుణ్యాన్ని ప్రదర్శించుకుని జిల్లాకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కబడ్డి అసోసియేషన్ పలు తీర్మాణాలు చేశారు. జిల్లాలో జరిగే కబడ్డి టోర్నమెంట్‌లో వేరే రాష్ట్రాలకు చెందిన వారు అంపైరింగ్ చేయడానికి వీలులేదని, కబడ్డి టోర్నమెంట్ నిర్వహించే ప్రతి గ్రామం జిల్లా కబడ్డి అసోసియేషన్ అనుమతి తప్పక తీసుకోవాలని, జూనియర్,సీనియర్ లెవల్‌లో జరిగే సెలక్షన్‌లలో క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన వారు మాత్రమే జిల్లా జట్టుకు ఎంపికవుతారన్నారు. ఎటువంటి సిఫార్సులకు కబడ్డి అసోసియషన్‌లో తావుండరాదన్నారు. సమ్మర్ క్యాంపు నిర్వహించేందుకు కమిటి వేసి తీర్మాణించాలని, అసోసియేషన్ మెంబర్స్ అందరు ఐక్యతతో కలిసి మెలసి మెలగాలని సూచించారు. ప్రతి క్రీడాకారుడు క్రమశిక్షణతో మెలగాలని,క్రమశిక్షణ ఉల్లంఘించినచో జిల్లా సెలక్షన్ కమిటీలో


మున్సిపల్ ఛైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం



కబడ్డి అసోసియేషన్ సభ్యులతో మున్సిపల్ ఛైర్మన్

వారి పేరు పరిగణనలోకి తీసుకోబడదన్నారు. మే నెలలో రాష్ట్రస్థాయి కబడ్డి టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహించుకుందామని అసోసియేషన్ సభ్యులకు ఛైర్మన్ కేశవ్ సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దౌలు, ఇండోర్ స్టేడియం ఇంచార్జి జితెందర్, శ్రీను, జిల్లా కబడ్డి అసోసియేషన్ సెక్రెటరీ అబ్రహం, ట్రెజరర్ కబడ్డి నరసింహ, వెంకటేష్, నగేష్,పాషా, టి. రవి,చందు, (సారయి) జగదీష్, పీఈటి కృష్ణ, వెంకటన్న, పెద్దపాడు రాములన్న, రజనికాంత్, శేఖర్, రఘు, తిరుపతి, బుజ్జిబాబు, గంట పరశ, మహేష్, సీనియర్ క్రీడాకారులు, బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు భగీరథ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 18న నియోజకవర్గ ప్రజాప్రతినిధులకు అవగాహన కార్యక్రమం

**మక్తల్,ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** పట్టణంలోని రాయచూర్ రోడ్డులో వట్టెం రవి ఫంక్షన్ హాల్‌లో ఈనెల 18వ తేదీన ఉదయం 10గం.ల నుండి స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యక్రమాలపై మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రజా ప్రతినిధులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు కార్యక్రమానికి ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హాజరవుతున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలో అందరు మున్సిపల్ ఛైర్మన్, మున్సిపల్ కౌన్సిలర్లు, జడ్పీటిసిలు, ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొనాలన్నారు. ముఖ్యంగా గ్రామాలలో అంగన్‌వాడి కేంద్రాల ద్వారా ప్రజలకు లభించే సేవలు, గర్భిణీ, బాలింతలకు ప్రభుత్వం ఇస్తున్న పౌష్టికాహారం ఆహారలక్ష్మి పథకం గురించి ప్రజా ప్రతినిధులకు సరైన అవగాహన కల్పించినప్పుడే ప్రజలకు ఖచ్చితంగా సేవలు అందుతాయని కలెక్టర్ అన్నారు. అన్ని అంగన్‌వాడి కేంద్రాలను బలోపేతం చేయాలని ఎమ్మెల్యే కోరినట్లు తెలిపారు. అన్ని అంగన్‌వాడి కేంద్రాలను బలోపేతం చేయాలని ఎమ్మెల్యే కోరినట్లు తెలిపారు. అన్ని అంగన్‌వాడిలకు సరైన వసతి సౌకర్యాలు సమకూర్చటం, అంగన్‌వాడి టీచర్లకు అవసరమైన శిక్షణ ఇవ్వడం వంటి పనులు ఇప్పటికే ప్రారంభించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అన్ని అంగన్‌వాడి కేంద్రాలు సక్రమంగా పనిచేయటం, గర్భిణీ బాలింతలకు సరైన పౌష్టికాహారం అందేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పిల్లలంరు తప్పనిసరిగా అంగన్‌వాడిలోనే చేరే విధంగా ప్రజా ప్రతినిధుల సహకారాలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. మక్తల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామ కార్యదర్శిలు అంగన్‌వాడి టీచర్లు తప్పనిసరిగా అవగాహన కార్యక్రమంలో పాల్గొనాలని కలెక్టర్ ఆదేశించారు.

# ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీమంత్రి డా.జి.చిన్నారెడ్డి..

**జల్లాఘణపురం,ఏప్రిల్ 16ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని స్థానిక చిన్న మజీద్ లో ఇఫ్తార్ విందులో ఏఐసీసీ కార్యదర్శి, మాజీ మంత్రి డా.జి.చిన్నారెడ్డి పాల్గొన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లిం సోదరులకు పండ్లు తినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగ మైనార్టీ సోదరులు రంజాన్ పవిత్ర మాసంలో ఉపవాసాలు ఉండడం గొప్ప విషయమని కొనియాడారు. ఇఫ్తార్ లో పాల్గొని పలువురు అన్ని మతాలు, కులాలు కలిసిమెలసి అన్నదమ్ముల్లా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, నయుముద్దీన్, అజీమ్, ముజాహిద్, గౌస్, రహీం, ఇంతియాజ్, కైమ్ మోహిత్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ కుమార్, డా.నరేందర్ గౌడ్, జిల్లా వికలాంగుల కమిటీ అధ్యక్షుడు గంజాయి రమేష్, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రామకృష్ణా రెడ్డి, కృష్ణయ్య యాదవ్, జిల్లా సోషల్ మీడియా కో ఆర్డినేటర్ ఎం దేవన్న యాదవ్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దివాకర్ యాదవ్, క్యామ బాలరాజు, ఎంపీటీసీ విజయలక్ష్మి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జయకర్, ప్రభాకర్ రెడ్డి, వాస నాగేశ్వర్, చెన్నయ్య, సోలీపూర్ బాల్‌రెడ్డి, నాగేందర్ గౌడ్, పెద్దమందడి మండల అధ్యక్షుడు పెంటన్న యాదవ్, గోపాల్‌పేట నరహరి, జిల్లెల ప్రవీణ్ కుమార్ రెడ్డి, చిట్యాల లింగస్వామి, వెంకటరాములు గౌడ్, ఆగారం కృష్ణయ్య , యాదయ్య, బాలరాజు యాదవ్, వాకిటి రమేష్, వంశీ మైబు,దుర్గ తదితరులు పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో పాల్గొని ముస్లిం సోదరులతో కలిసి పాల్గొన్న మాజీ మంత్రి చిన్నారెడ్డి

## దిగంబరస్వామి జాతర సందర్భంగా బండలాగుడు పోటీలు..


బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి


బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్

**జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం బలిగెర గ్రామంలో దిగంబరస్వామి జాతర సందర్భంగా బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను జిల్లా జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య, స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మాజీ జడ్పీ ఛైర్మన్ బండారి భాస్కర్, గట్టు జడ్పీటిసి బాసు శ్యామల హనుమంతునాయుడు పాల్గొన్నారు.**

గద్వాల ప్రతినిధి,ఏప్రిల్ 16 ప్రభాతవార్త

## దశదినకర్మకు హాజరైన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**నవాబ్‌పేట,ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** జంగమయ్యపల్లి సర్పంచ్ వెంకటేష్ మాతృమూర్తి దశదినకర్మకు హాజరైన ఎమ్మెల్యే డా. లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఆయన వెంట దర్పల్లి గ్రామానికి చెందిన టిఆర్ఎస్ సీనియర్ నాయకులు రైతుసంఘం అధ్యక్షులు నర్సి రెడ్డిలు ఉన్నారు. కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, టిఆర్ఎస్ నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న కొత్త్ర గ్రామ సేవా సమితి అధ్యక్షులు



**వెల్దండ, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** వెల్దండ మండలం కొత్ర గ్రామానికి చెందిన పొనుగోటి విష్ణువర్ధన్ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విష్ణువర్ధన్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2లక్షల ఎల్ఓసీని మంజూరు చేసి మానవత్వం చాటుకున్నారు కొత్ర గ్రామ సేవా సమితి అధ్యక్షులు పొనుగోటి రవీందర్‌రావు. ఆదివారం నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విష్ణువర్ధన్‌ను పరామర్శించి రూ.2లక్షల ఎల్ఓసీని బాధితుడికి అందించి ధైర్యంగా ఉండాలని సూచించారు.

## నేడు ఎమ్మెల్యే పర్యటన..

**నారాయణపేట ప్రతినిధి,ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** నేడు సోమవారం ఉదయం 10.30 గం.లకు ధన్వాడ మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా కూరగాయల మార్కెట్,గ్రామ పంచాయతీ భవన శంకుస్థాపన, గ్రంథాలయం రూ. 28 లక్షలతో నిర్మిస్తున్న కాజ్‌వే నిర్మాణ పనుల శంకుస్థాపన, మన ఊరు మనబడి పనుల ప్రారంభోత్సవం, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న దళితులకు మూడు ఎకరాల భూముల లబ్దిదారులకు పట్టా పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి హాజరు కానున్నారు. కావున మండల స్థానిక నాయకులు, ప్రజలు లబ్దిదారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు.

## గుడికి వార్డు సభ్యుడు రాము విరాళం

**దేవరకద్ర,ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** దేవరకద్రలోని నట్టలి వాళ్ళ గుడికి ఆదివారం స్థానికుడైన 8వ వార్డు సభ్యుడు గౌని రాము రూ.50 వేల211 రూపాయల విరాళాన్ని అందజేశారు. గతంలో గుడికి విరాళం అందజేస్తానని గౌని రాము హామి ఇచ్చారు. అట్టి హామి ప్రకారం గుడికి ఆయన



విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నట్టలి అంజనేయులు, గిద్దటి అంజనేయులు,చిన్న నరసింహ్ములు,గౌని శ్రీను,గౌని తిమ్మన్న, శాలి అంజనేయులు,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చిన జడ్పీ చైర్‌పర్సన్




ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన జడ్పీ చైర్‌పర్సన్





ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం

**గద్వాల ప్రతినిధి,ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. రంజాన్ పండగ సందర్భంగా ముస్లిం సోదరులకు ఆదివారం సాయంత్రం జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నాగర్‌దొడ్డి వెంకటరాములు, అమరవాయి కృష్ణారెడ్డి, ముస్లిం కులపెద్దలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## నాటక ప్రదర్శనకు రూ.20వేల ఆర్థికసాయం

**కల్వకుర్తి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:**కల్వకుర్తి మండలం తాండ్ర గ్రామంలో శ్రీ ఆది చింతల మునిరంగస్వామి నాటక ప్రదర్శన నిర్వహిస్తున్నారు. గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుం కిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాల్లో ప్రదర్శిస్తున్న నాటకాలను ప్రోత్సహించాలన్నారు. ఫౌండేషన్ సహకారంతో రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని నాటకదారులకు అందించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఉప సర్పంచ్ కేశమల్ల అల్లాజీ, గ్రామస్తులు సుల్తాన్, క్యామ శ్రీనివాసులు, బొల్లె చిట్టయ్య, కృష్ణయ్య, అంజయ్య, బాలస్వామి, ఫౌండేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.



## పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని విజయవంతం చేద్దాం...

**వెల్దండ, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:**వెల్దండ మండల కేంద్రంలోని బ్రహ్మగిరి దేవాలయంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 1965 నుంచి 2022 వరకు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులతో ఆత్మీయ సమ్మేళనం ఈ నెల 23న నిర్వహించి విజయవంతం చేద్దామన్నారు. ప్రతి ఒక్కరికి సమావేశాన్ని అందించి సమావేశానికి అందరు హాజరయ్యే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బచ్చు రామకృష్ణ, ఉప్పు ఆంజనేయులు, విజయేందర్‌రెడ్డి, వేణుగోపాలాచారి, విష్ణు సాగర్, శ్రీనుగౌడ్, మదన్‌గౌడ్, వెంకటేష్,సహీర్ అహ్మెద్ షేక్ తదితరులు ఉన్నారు.



## శివగంగా బైలు నాటకానికి రూ.30వేల ఆర్థిక సహాయం

**వెల్దండ, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:**మండల పరిధిలోని రాచూర్ గ్రామంలో శివగంగా కళ్యాణ బైలు నాటకానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సమకూర్చిన రూ.30వేల ఆర్థిక సహాయాన్ని ఫౌండేషన్ సభ్యులు వెంకట్రావ్‌తో పాటు ఫౌండేషన్ సభ్యులు నాటకదారులకు అం దించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ గ్రామీణ నాటకాలను పౌండేషన్ ద్వారా ప్రోత్సహించి వారికి ఆర్థిక సహాయం అందించి అండగా నిలుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో యాదయ్య, మల్లేష్ ముదిరాజ్, జయరాం, లక్ష్మయ్య, కృష్ణయ్య, శంకర్, రామకృష్ణ, బక్కయ్య, వంశీ, శ్రీరాములు, ఫౌండేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.



## ప్రశాంతంగా మోడల్ ప్రవేశ పరీక్ష

**వెల్దండ, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:**వెల్దండ మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో 6,7వ తరగతుల ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహిం చినట్లు సీఎస్.పుష్పలత తెలిపారు. 6వ తరగతి ప్రవేశ పరీక్షకు సెంటర్ ఎ లో 240 మంది విద్యార్థులకు 156 మంది హాజరు కాగా, సెంటర్ బి లో 195 మంది విద్యార్థు లకు గాను 129 మంది హాజరైనట్లు తెలిపా రు. మధ్యాహ్నం 7వ తరగతి ప్రవేశ పరీక్ష కు సెంటర్ ఎ లో 235 మంది విద్యార్థుల కు 180 మంది హాజరు కాగా, సెంటర్ బి లో 212 మంది విద్యార్థులకు గాను 154 మంది హాజరైనట్లు తెలిపారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించినట్లు సీఎస్.పుష్పలత పేర్కొన్నారు. డీఓ రాధకృష్ణ, సీఎస్ పర్వతాలు, నర్సింహ్మతదితరులు ఉన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం..

**కల్వకుర్తి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:**కల్వకుర్తి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన బోయ జంగయ్య అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు.మృతుడి కుటుంబాన్ని ఐక్యత ఫౌండేషన్ సభ్యులు పరామర్శించి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘ వేందర్‌రెడ్డి సమకూర్చిన రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. మృతుడి కుటుంబానికి ఫౌండేషన్ తరుపున ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్తులు రవి, మహేష్, హరీష్, శ్రీహరి, సాయి, మల్ల య్య, భీరయ్య, శ్రీపతిరాజు, హసన్, గణేష్, షఫీ, శేఖర్ తదితరులు ఉన్నారు.



## దేవరకద్ర ఎస్ఐకి సన్మానం

**దేవరకద్ర,ఎప్రిల్ 16 ప్రభాతవార్త:** దేవరకద్రలో కొత్త ఎస్ఐగా పదవిభాద్యతలు చేపట్టిన జి.వెంకటేశ్‌కు ఆదివారం దేవరకద్ర మండల కిరాణ అసోసియేషన్ సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐను మర్యాదపూర్వకంగా కలసి వారు పూల మాలు వేసి శాలువాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు గుద్దేటి చంద్రయ్య,యువజన సంఘం సభ్యులు దోమహరికాంత్,కిరాణ అసోసియేషన్ సంఘం ఉపాధ్యక్షుడు బిల్ల కంటి సత్యం,సభ్యులు మైలపురం రమేశ్,కల్వఈశ్వర్,బిల్లకంటి వెంకట్‌రాములు,సుంకరి రాఘవేంద్ర,సుంకరి వంశీకృష్ణ,వేముల దశరథ,మారం కిశోర్‌కుమార్,కొండ శ్రీనివాసులు,నారని బాలస్వామి,అలంపల్లి రవికుమార్,బీచా ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వీపనగండ్ల మండలంలో చలివేంద్రం ఏర్పాటు..

**వీపనగండ్ల,ఏప్రిల్ 16ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఎండల తీవ్రత దృష్ట్యా మండల కేంద్రానికి వివిధ గ్రామాల నుండి వచ్చే ప్రజలకు దాహం తీర్చడానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ముంత మల్లయ్య ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటుచేయడం జరిగింది. చలివేంద్రాన్ని గ్రామ సర్పంచ్ వంగూరు నరసింహారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువకు లు పాల్గొన్నారు. చలివేంద్రం ఏర్పాటు చేయడంపై పలు గ్రామాల నుండి మండలానికి వచ్చే ప్రజలు తమ దాహం తీరిపోతుందని సంతోషం వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ..!

### 9 ఏండ్లుగా ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రజలను మోసగిస్తున్నారు

**ఇటిక్యాల,ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** రానున్న ఆరు నెలల్లో జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుంటే రైతులకు ఒకేసారి 2లక్షల రుణమాఫీ రూ. 5 లక్షలతో ఉచితంగా ఇంటి నిర్మాణం నిరుద్యోగులకు కొత్త ఉద్యోగాల నియామకం. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతుందని ఏఐసిసి కార్యదర్శి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ప్రజలకు వివరించారు. ఆదివారం మండల పరిధిలోని హాత్ సే హాత్ జోడో యాత్ర కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని గోపాల్‌దిన్నె, మొగల్ రావల్ చెరువు, పెద్దదిన్నె, శివనంపల్లి గ్రామాలలో పర్యటిస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి కెసిఆర్ నెవేర్చడం లేదని అలంపూర్ అధికార పార్టీలో వర్గ విభేదాలతో అలంపూర్ అభివృద్ధికి నోచుకోవడం లేదని, ఇసుక, లిక్కర్ మాఫియాపై ఉన్న ప్రేమ అలంపూర్ అభివృద్ధిపై పెట్టడం లేదని విమర్శించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ దళితులకు మూడెకరాల భూ పంపిణీ, డబుల్ బెడ్‌రూం ఇండ్లు, నిరుద్యోగులకు ఉద్యోగ అవకశాలు కల్పించలేదని అదేవిధంగా రేషన్ కార్డులు, పింఛన్లు, అర్హులైన ప్రజలకు అందడం లేదని మండిపడ్డారు. ఈ సందర్భంగా అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ వ్యవసాయ పొలంలో కూలీ పనులు చేస్తున్న మహిళలను పలకరించగా తమకు ఇండ్లు లేవని పింఛన్లు రావడం లేదని, రేషన్ కార్డులు లేవని పలు సమస్యలను ఆయన దృష్టికి



సమస్యలను తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్



మహిళాకూలీలతో కలిసి భోజనం చేస్తున్న అలంపూర్‌మాజీ ఎమ్మెల్యే

తీసుకువచ్చారు.ఈ సందర్భంగా వారితో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఏఒక్కటి నెరవేర్చలేదని కాంగ్రెస్ ప్రభుత్వంలో అందరికి ఉచితంగా 2 లక్షల రుణమాఫీ, 5 లక్షలతో ఇంటి నిర్మాణం, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన,పింఛన్లు, రేషన్ కార్డులు, ఇతర సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని వచ్చే ఎన్నికల్లో మరోసారి మోసపోవద్దని, ఇందిరమ్మ రాజ్యంతోనే పేద ప్రజలకు అన్ని రకాల సంక్షేమ పథకాలు అందుతాయని మహిళా కూలీలకు వివరించారు. ఆ తర్వాత మహిళలతో కలిసి ఏఐసిసి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంతప్‌కుమార్‌కు మహిళా కూలీలు ఆయనకు ఆప్యాయంగా భోజనం పెట్టారు. కార్యక్రమంలో అలంపూర్ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎర్రవల్లి సర్పంచ్, రవి, అలంపూర్ మండల పార్టీ అధ్యక్షుడు రాము, మెడికల్ మద్దిలేటి, ఆయా గ్రామాల స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఆత్మీయులను కలవడం ఆనందంగా ఉంటుంది ఎంపీపీ మేఘారెడ్డి..

**పెద్దమందడి,ఏప్రిల్ 16ప్రభాతవార్త:** పెద్దమందడి మండల కేంద్రానికి చెందిన ఈరమోని గోవర్దన్ కుమారుని ఉయ్యాల కార్యక్రమానికి పెద్దమందడి ఎంపీపీ తూడి మేఘారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన చిన్నారిని దీవించి శుభాకాంక్షలు తెలిపారు. మనం అభిమానించే వ్యక్తులను కలవడం ఎంతో ఆత్మీయంగా ఉంటుందని అన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో బం దువర్గంతో పాటు తెలిసిన వ్యక్తులు, ఎందరో అభిమానాలు హాజరవుతుం టారని అందరిని కలిసి ఆప్యాయం గా పలకరించడంతో ఆత్మీయతతో కూడిన బంధం ఏర్పడుతుందని ఎంపీపీ పేర్కొన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు సత్యారెడ్డి, వరేష్, మహేష్, తిరుపతి రెడ్డి, టైలర్ రవి తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యాల కార్యక్రమంలో ఎంపీపీ మేఘారెడ్డి

## వర్కూర్ గ్రామంలో కుక్కల దాడి..

**నలుగురికి తీవ్ర గాయాలు,, పట్టించుకోని అధికారులు**





కుక్కల దాడిలో గాయపడిన దృశ్యం

**నారాయణపేట ప్రతినిధి,ఏప్రిల్16 ప్రభాతవార్త :**నారాయణపేట జిల్లా మాగనూరు మండలం వ ర్కూర్ గ్రామంలో కుక్కలదాడులు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. ఆదివారం ఏకంగా గ్రామంలో ఉన్న నలుగురిపై కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరచడం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. గాయపడిన వారిలో పసుల భవ్యశ్రీ, అభిరాం, దమంతమ, తరబీలను కుక్కలు గాయపరిచాయి. కుక్కల దాడిలో గాయపడ్డ వారిని మక్తల్ ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చి చికిత్స చేయించినట్లు గ్రామస్తులు తెలిపారు. గత పది రోజుల క్రితం గ్రామ సభలో కుక్కలను తరలించాలని తీర్మాణం చేసి ఎంపిడిఓకు ఫోన్‌ద్వారా సమాచారం ఇచ్చిన ఇప్పటివరకు స్పందించలేదని గ్రామస్తులను మీరే ఏదైనా చేసుకోవాలని మేము చేయలేము అన్నట్లుగా అన్నారని తెలిపారు. కుక్కల నియంత్రణ కొరకు కనీసం ఇంజక్షన్లు వాడాలని లేదా గ్రామం నుంచి దూర ప్రాంతాలకు కుక్కలను తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్ రూం దరఖాస్తుల జాబితా పూర్తి..

**వనపర్తి టౌన్,ఏప్రిల్ 16ప్రభాతవార్త:** వనపర్తి మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్ల లబ్దిదారులను ఎంపిక చేయడానికి సంబందించి 2021 సంవత్సరంలో అప్పటి జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం దరఖాస్తులు వార్డుల వారీగా తీసుకోవడం జరిగిందని, తీసుకున్న దరఖాస్తుల పూర్తి జాబితాను నేడు ఉదయం 10గంటలకు వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని వార్డులలో, తహసిల్దార్ కార్యాలయం, వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, ఆర్డీఓ కార్యాలయాల్లో పూరినత జాబితాను ప్రదర్శించడం జరుగుతుందని, ఇట్టి జాబితాలో గతంలో ఎవరైన అర్జీ చేసుకొని ఉండి ప్రస్తుతం ప్రచురించిన పూర్తి జాబితాలో వారి పేరు రానివారు నేటి నుండి 19వ తేదీ సాయంత్రం 5గంటల వరకు తహసిల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ లో తమ దగ్గర ఉన్న పూర్తి ఆధారాలు సమర్పించాలని వనపర్తి తహసిల్దార్ రాజేందర్ గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

**నోట్:**డబుల్ బెడ్ రూం ఇండ్లను సంబందించిన నూతన దరఖాస్తులను తీసుకోబడవు



వనపర్తి తహసిల్దార్ రాజేందర్ గౌడ్

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీపీ..

**పెద్దమందడి,ఏప్రిల్ 16ప్రభాతవార్త:** మండల కేంద్రానికి చెందిన వాకిటి వేణు తల్లి రుక్మమ్మ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మేఘారెడ్డి మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నాయని, వృద్దులు చిన్న పిల్లలు చాలా జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు సత్యరెడ్డి, మహేష్, వరేష్, టైలర్ రవి తదితరులు ఉన్నారు.



పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎంపీపీ

## 30వ వార్డులో విజయనగర్ కాలనీలో ఉదయపు పర్యటన చేసిన మున్సిపల్ వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్..

**వనపర్తి టౌన్,ఏప్రిల్ 16ప్రభాతవార్త:** వన పర్తి మున్సిపల్ పరిధిలోని 30వ వార్డులో విజయనగర్ కాలనీలో అన్ని రోడ్లను తిరుగుతూ ఉదయం నడకలో భాగంగా అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ కాలనీలో ఉన్న అన్ని సమస్యలను మంత్రి నిరంజన్ రెడ్డి సహకారంతో పూర్తి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. నూతనంగా విద్యుత్ లైన్ లో ఏర్పాటు చేసిన వీధి దీపాల ఏర్పాటు చేయడం జరుగుతుందని, డ్రైనేజీ వ్యవస్థ రోడ్ల వ్యవస్థ మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నానని ప్రజలందరు మంత్రి నిరంజన్ రెడ్డికి సహకారంగా ఉంటూ మనవాడు అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది బాలు, నరసింహ, సుందర్, మన్యం, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్

## మంత్రిని కలిసిన రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ రాజవరప్రసాద్..

**వనపర్తి ప్రతినిధి,ఏప్రిల్ 16ప్రభాతవార్త:** రాష్ట్ర సహకార యూనియన్ చైర్మెన్‌గా నియమితులైన రాజ వరప్రసాద్, సభ్యులు తిరుమల మహేష్‌లు ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి రాజవరప్రసాద్‌కు, తిరుమల మహేష్ కు శాలువా కప్పి సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాజవర ప్రసాద్, తిరుమల మహేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో నమ్మకంతో ఇచ్చిన బాద్యతలను మంత్రి సహకారంతో చిత్తశుద్దితో పనిచేసి సహకార సంఘాల బలోపేతానికి కృషి చేస్తానని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ రమేష్ గౌడ్, మున్సిపల్‌వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్, రైతు సంఘం అధ్యక్షులు నరసింహ, కౌన్సిలర్ మంజుల గోపాల్ యాదవ్, బికె నరసింహ పాల్గొన్నారు.



రాష్ట్ర సహకర యూనియన్ సభ్యులు తిరుమల మహేష్ ను సన్మానిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

## అపర భగీరథుడు వర్కటం జగన్నాథ్‌రెడ్డి

**బోరు వేయడానికి భూమిపూజ చేసిన వర్కటం**

**నారాయణపేట ప్రతినిధి,ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** ఏ పదవి లేకున్నా ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఏ కష్టం వచ్చినా పిలిస్తే పలుకుతా నిరంతరం ప్రజాసేవకే అంకితం అవుతానని బిఆర్ఎస్ నేత, విజెఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చిన విధంగానే మక్తల్ మండలం గార్లపల్లి గ్రామంలో మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు మక్తల్ బిఆర్ఎస్ నేత విజెఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి దృష్టికి తీసుకు వచ్చారు. వర్కటం సానుకూలంగా స్పందించి గతంలో గ్రామంలో పర్యటించి గ్రామస్తుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తుల కోరిక మేరకు రూ. 50 వేలతో బోరుమోటారుకు పూజచేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులంతా వర్కటంని అపర భగీరథుడని కొనియాడారు. ఇచ్చిన మాట ప్రకారం పనులు ప్రారంభించడంతో హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అశోక్ సత్యరెడ్డి, తాయప్ప, ఆంజనేయులు పాల్గొన్నారు.



బోరు వేయడానికి భూమిపూజ చేస్తున్న వర్కటం జగన్నాథం

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీపీ మేఘారెడ్డి..

**పెద్దమందడి,ఏప్రిల్ 16ప్రభాతవార్త:** పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామంలో ముస్లిం సోదరులకు వెల్టూరు సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ మేఘారెడ్డి ఇఫ్తార్ విందు ఇచ్చారు. వీరితో పెద్దమందడి సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు ఐ.సత్యరెడ్డి, మాజీ జడ్పీటీసీ రమేష్ గౌడ్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి,మనిగిళ్ల సర్పంచ్ సరిత తిరుపతి రెడ్డి, వెల్టూరు డీలర్స్ శ్రీనివాసులు, ముస్లిం సోదరులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



ముస్లిం సోదరులతో కలిసి పాల్గొన్న ఎంపీపీ మేఘారెడ్డి

## నేడు ఇఫ్తార్ విందుకు హాజరు కానున్న ఎమ్మెల్యే

**నారాయణపేట ప్రతినిధి,ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** నేడు సోమవారం సాయంత్రం 6 గం.లకు క్లాసిక్ ఫంక్షన్ హాల్‌లో రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులకు ప్రభుత్వం తరపున ఏర్పాటు చేయనున్న దావత్ ఇ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయనున్నారు.ఇఫ్తార్ విందుకు స్థానిక ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ వజనమ్మ, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు. నారాయణపేట జిల్లా ముస్లిం సోదరులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని డిఎండబ్ల్యుఓ బి. గోవిందరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి..మరోకరికి గాయాలు..

**దేవరకద్ర,ఎప్రిల్ 16 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం పెద్దగోప్లాపూర్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరొకరు గాయపడ్డారు. ఎస్ఐ వెంకటేశ్ కథనం ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి.నారాయణపేట జిల్లా నర్వ మండలం కుమార్‌లింగంపల్లి గ్రామానికి చెందిన వడ్డెనరసింహ్ములు తన స్నేహితుడి గొల్ల సత్యప్పతో కలసి టీవీఎస్ పై వెళ్తూ పెద్దగోప్లాపూర్ వద్ద రోడ్డు పక్కన పండ్లు తీసుకొని రోడ్డు ఎక్కుతుండగా వెనుకనుండి హైడ్రాలిక్ క్రేన్ వచ్చి ఢీ కొంది. ఈ ప్రమాదంలో వడ్డెనరసింహ్ములు అక్కడికక్కడే మృతి చెందాడు. గొల్ల సత్యప్ప గాయపడ్డాడు. ఈ విషయం తెలుసుకొన్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడ్డ గొల్ల సత్యప్ప వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు.శవపంచనామ అనంతరం వడ్డెనరసింహ్ములు శవాన్ని కూడ పోస్టుమార్టమ్ నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు.మృతుడి భార్య పార్వతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వడ్డెనరసింహ్ములు